తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం - 10- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 36 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in



# కాలుష్య రహిత హైదరాబాద్ లక్ష్యం

## ప్రీమియర్ ఎనర్జీస్ సోలార్ యూనిట్ ప్రారంభించిన సీఎం

## ఓఆర్ఆర్ లోపల పూర్తిగా కాలుష్యరహిత నగర నిర్మాణమే లక్ష్యం

## పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలిస్తామని స్పష్టం

**హైదరాబాద్, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల ఉన్న మొత్తం ప్రాంతాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ ఏర్పాటు చేసిన 5.6 గిగావాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి గురువారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. 2,100 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఓఆర్ఆర్ లోపలి కోర్ అర్బన్ ప్రాంతంలో 1.35 కోట్ల జనాభా అవసరాలకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ రూపొందించిన తొలి సోలార్ ఆక్సీట్రీతో పాటు సోలార్ విద్యుత్ ఆధారిత వీధి దీపాలు, గాలిని శుద్ధి చేసే వ్యవస్థలను ముఖ్యమంత్రి పరిశీలించారు. సోలార్ మాడ్యూల్స్ తయారీకి సంబంధించిన వివిధ ఉత్పత్తులను సందర్శించి సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. స్వచ్ఛ ఇంధన రంగంలో తెలంగాణ ముందంజలో నిలిచేలా ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు.
దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలు కాలుష్యం, ప్రణాళికా లోపాలతో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించిన ముఖ్యమంత్రి, వాటి నుంచి తెలంగాణ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మిగతా 2లో

# మెగా రైతు మేళాకు శ్రీకారం

- మధిరలో ప్రారంభించిన భట్టి, తుమ్మల
- రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి
- వ్యవసాయాభివృద్ధికి వేల కోట్ల రూపాయల కేటాయింపు



**ఖమ్మం, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించిన మెగా రైతు మేళాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ

మిగతా 2లో



# గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలి : సీతక్క

- ప్రణాళికాబద్ధ పాలనతోనే గ్రామాభివృద్ధి సాధ్యం
- 16వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారమే వినియోగించాలని సూచన
- సర్పంచులకు సమగ్ర శిక్షణ కార్యక్రమం
- మంత్రి అనసూయ సీతక్క

**ములుగు, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసి, ప్రణాళికాబద్ధమైన పాలనతో గ్రామాభివృద్ధిని సాధించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.

మిగతా 7లో



# ఇందిరమ్మ ఇళ్లకు పరిశ్రమల భాగస్వామ్యం

- స్టీల్, సిమెంట్ సంస్థలకు మంత్రి పొంగులేటి పిలుపు
- రాయితీ ధరలకు నిర్మాణ సామగ్రి అందించాలని విజ్ఞప్తి
- ఇందిరమ్మ ఇళ్లపై పరిశ్రమలతో సమీక్ష సమావేశం

2లో

# ఏడు రోజుల ఎల్లో అలర్ట్

- తెలంగాణకు ఐఎండీ హెచ్చరిక
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షా ల సూచన
- ఉత్తర జిల్లాల్లో గంటకు 60 కి.మీ. వేగంతో ఈదురుగాలులు

**హైదరాబాద్, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్రానికి భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వచ్చే ఏడు రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు నమోదయ్యే అవకాశముందని ఐఎండీ తెలిపింది.

మిగతా 2లో



# ఎయిమ్స్‌లో కేంద్ర మంత్రి నడ్డా సందర్శన

- బీబీనగర్ ఎయిమ్స్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి
- ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లు
- ప్రశాంతంగా ముగిసిన పర్యటన

**యాదాద్రి భువనగిరి, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి. నడ్డా గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ నాయకులు,

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# కాలుష్య రహిత హైదరాబాద్ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

జీడిమెట్ల, బాలానగర్ వంటి పారిశ్రామిక ప్రాంతాల నుంచి వెలువడుతున్న కాలుష్యం, మూసీ నది కాలుష్యంతో నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అందుకే ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని పూర్తిగా కాలుష్య రహితంగా మార్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోంద న్నారు. పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపల ఏర్పాటు చేస్తున్న తయారీ మండలాలకు తరలించేందుకు ఇప్పటికే చట్టం తీసుకొచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తరలించే పరిశ్రమలకు అవసరమైన భూములను ప్రభుత్వం కేటాయిస్తుందని చెప్పారు. ఈ తయారీ మండలంలో తొలి పరిశ్రమగా ప్రీమియర్ ఎనర్జీస్ యూనిట్ ప్రారంభం కావడం సంతోషకరమని, కేవలం 12 నెలల్లో యూనిట్ నిర్మాణాన్ని పూర్తి చేసిన సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. 'తెలంగాణ రైజింగ్-2047' దృష్టిపత్రం ప్రకారం రాష్ట్రాన్ని మూడు ప్రాంతీయ మండలాలుగా అభివృద్ధి చేస్తున్నామని, 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఉన్నత శిక్షణ కేంద్రాలు, పాలిటెక్నిక్ కళాశాలలు, నైపుణ్య విశ్వవిద్యాలయం ద్వారా పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను తయారు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా ఎదగాలంటే మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు అవసరమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించడం అభినందనీయమని, ప్రకృతి పరిరక్షణలో ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన, సుస్థిరమైన హైదరాబాద్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

# మెగా రైతు మేళాకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగునీరు, ధాన్యం కొనుగోలు, వ్యవసాయ యాంత్రీకరణ, మార్క్‌ఫెడ్ బలోపేతానికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతుల ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ ధ్యేయమని భట్టి పేర్కొన్నారు. రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9,000 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు.

ధాన్యం, మొక్కజొన్న, జొన్నల కొనుగోలు ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నామని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు పలు సంస్కరణలు అమలు చేస్తున్నామని వివరించారు. రైతు సంక్షేమం విషయంలో ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా చేతల్లో నిరూపిస్తోందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రైతే దేశానికి వెన్నెముక అని, ఆ వెన్నెముకను మరింత బలోపేతం చేస్తూ రైతు కుటుంబాల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులకు కొత్త సాంకేతికతలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చే దిశగా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని అధికారులు తెలిపారు.



# ఇందిరమ్మ ఇళ్లకు పరిశ్రమల భాగస్వామ్యం

**హైదరాబాద్, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో స్టీల్, సిమెంట్ పరిశ్రమలు సామాజిక బాధ్యతతో భాగస్వాములు కావాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, టీజీఐఐసీ ఎండీ శశాంకతో కలిసి ఆయా పరిశ్రమల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని



అమలు చేస్తోందన్నారు. ఇది కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాకుండా పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రతను అందించే మహాయజ్ఞమని పేర్కొన్నారు.

స్టీల్, సిమెంట్ పరిశ్రమలు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి రాయితీ ధరలకు నాణ్యమైన నిర్మాణ సామగ్రిని అందించాలని మంత్రి కోరారు. ప్రభుత్వంతో కలిసి పనిచేస్తే పేదల ఇళ్ల నిర్మాణం మరింత వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టలేదని మంత్రి చెప్పారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు కలిసి పనిచేస్తే తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని త్వరగా సాధించవచ్చని మంత్రి అన్నారు. లబ్ధిదారులకు నిర్మాణ సామగ్రి సకాలంలో చేరేలా అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలు సమన్వయంతో కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగస్వామ్యం కావడానికి స్టీల్, సిమెంట్ పరిశ్రమల ప్రతినిధులు సానుకూలంగా స్పందించినట్లు మంత్రి తెలిపారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమంలో అన్ని వర్గాలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఏడు రోజుల ఎల్లో అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని ప్రాంతాల్లో స్వల్పకాలంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బలమైన గాలుల కారణంగా బలహీన నిర్మాణాలు, చెట్లు, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. రైతులు వర్ష సూచనలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, పంటలను రక్షించేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. మత్స్యకారులు, బహిరంగ ప్రాంతాల్లో పనిచేసే వారు కూడా వాతావరణ హెచ్చరికలను పాటించాలని తెలిపారు. ప్రజలు అత్యవసరం అయితే తప్ప వర్షం, ఉరుములు, మెరుపుల సమయంలో బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని విపత్తు నిర్వహణ అధికారులు సూచించారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ విడుదల చేసే తాజా హెచ్చరికలను అనుసరిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక అధికారులను సంప్రదించాలని సూచించారు.

# ఎయిమ్స్‌లో కేంద్ర మంత్రి నడ్డా సందర్శన

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి పర్యటన సందర్భంగా జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ పర్యవేక్షణలో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో సమన్వయం చేసుకుంటూ అన్ని శాఖల సహకారంతో భద్రతా ఏర్పాట్లను సమర్థవంతంగా అమలు చేశారు.

కీలక ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించి, ప్రవేశ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజల భద్రతకు సంబంధించిన చర్యలను కట్టుదిట్టంగా అమలు చేశారు. పర్యటనకు వచ్చే ప్రజలు, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ట్రాఫిక్‌ను సజావుగా కొనసాగించేలా పోలీసులు చర్యలు చేపట్టారు. కార్యక్రమం జరిగే ప్రాంతాల్లో భద్రతా తనిఖీలను ముమ్మరం చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

పోలీసు శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయడంతో కేంద్ర మంత్రి పర్యటన ప్రశాంతంగా కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. పర్యటన విజయవంతంగా ముగియడంతో బందోబస్తు నిర్వహణలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ అప్రమత్తంగా పనిచేసిందని అధికారులు తెలిపారు.



# 'ఛాత్రోన్ కా గూంజ్' కార్యక్రమం

- విద్యార్థులతో యువజన కాంగ్రెస్ ముఖాముఖి
- కేంద్ర విద్యా విధానంపై విమర్శలు
- వినూత్న నాటికతో నిరసన

**హైదరాబాద్, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఛాత్రోన్ కా గూంజ్' కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులతో ముఖాముఖి చర్చా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యా రంగానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. కార్యక్రమానికి భారత యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయభాను చిబ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు.






ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ పట్ల అవలంబిస్తున్న వైఖరిని యువజన కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. విద్యార్థుల ప్రయోజనాలకు అనుగుణంగా విద్యా విధానాలు అమలు చేయాలని, విద్యా రంగానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వేషధారణలో యువజన కాంగ్రెస్ నాయకులు వినూత్న నాటికను ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నాటిక ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఉన్నత విద్యలో అవకాశాలు పెంచడంతో పాటు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని యువజన కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

# స్పీకర్‌ను కలిసిన సీఎస్

- అధికార నివాసంలో మర్యాదపూర్వక భేటీ
- సంజయ్ జాజును సన్మానించిన స్పీకర్
- రాష్ట్రాభివృద్ధి అంశాలపై చర్చ

**హైదరాబాద్, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం అధికార నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొని రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సంజయ్ జాజును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాలువాతో ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పరిపాలనలో విజయవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

ఈ భేటీలో వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య కూడా పాల్గొన్నారు.



సమావేశం అనంతరం స్పీకర్ ప్రధాన కార్యదర్శికి మరోసారి అభినందనలు తెలియజేసి విజయవంతమైన పదవీకాలాన్ని ఆకాంక్షించారు. రాష్ట్ర పరిపాలనను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో ప్రభుత్వం, శాసనసభ, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించినట్లు అధికారులు తెలిపారు.

## అర్హుల చేతికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు..
## ఎమ్మెల్యేతో కలిసి పంపిణీలో మున్సిపల్ చైర్మన్



**జమ్మికుంట టౌన్ జూలై 09 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణ పరిధిలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం ఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొన్నారు.
పట్టణంలోని పలు వార్డులకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యేతో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థికంగా ఎంతో అండగా నిలుస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖిల్లా ఘణపురం–పెద్దమందడి
## మార్కెట్ యార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి,జూలై 09(తెలంగాణ ముచ్చట్లు):** రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.గురువారం ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో ఖిల్లా ఘణపురం-పెద్దమందడి వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.వనపర్తి నియోజకవర్గానికి రెండు కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందని, దీంతో వేలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. మార్కెట్ యార్డుల్లో ఆధునిక గోదాములు, షెడ్లు, తాగునీరు, విద్యుత్, తూకం యంత్రాలు, అంతర్గత రహదారులు, రైతుల విశ్రాంతి గదులు తదితర సౌకర్యాలను దశలవారీగా కల్పిస్తామని తెలిపారు. రైతులు పంటను నిల్వ ఉంచుకునేందుకు అత్యాధునిక గోదాములను త్వరలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర లభించే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా మార్కెట్ అధికారి పుష్పలత నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.పాలకవర్గం అధ్యక్షురాలు క్యామ నవనీత (ఖిల్లా ఘణపురం)
ఉపాధ్యక్షుడు: కొత్తకాపు వెంకటేశ్వర్ రెడ్డి (దొడగుంటపల్లి)డైరెక్టర్లు: దిండు రవీందర్ (వెల్టూర్), డి. బాలరాజు (జంగమయ్యపల్లి), ముప్పూరి రత్నయ్య (మణిగిల్ల), తలకొండపల్లి రఘునాథ్ (పెద్దమందడి), బయన్న రామచంద్రయ్య (మానాజీపేట), పాత్లావత్ భాష (దొంతికుంట తాండా), ఎస్. రవీందర్ రెడ్డి (సోలిపూర్), మర్యాద బాలకృష్ణ రెడ్డి (కంబాలపురం), బత్తుల దుర్గయ్య (సల్కెలాపురం), ఎం.డి. ఖాజా నైముద్దీన్ (ఘణపూర్), తూడి రవీంద్రనాథ్ రెడ్డి, తూము రామకృష్ణారెడ్డి.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన మార్కెట్ యార్డ్
## డైరెక్టర్ దిండు రవీందర్‌కు ఘన సన్మానం



**ఖిల్లా ఘనపూర్,జులై09(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్-పెద్దమందడి మండలాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన డైరెక్టర్‌గా నియమితులైన దిండు రవీందర్‌ను వెల్టూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా దిండు రవీందర్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశారు.రైతుల సంక్షేమం, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధే తన లక్ష్యమని, రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు సీసీ కెమెరాలే కీలకం: కరీంనగర్ సీపీ గౌష్ ఆలం





- **హుజురాబాద్ డివిజన్‌లో 21 కొత్త సీసీ కెమెరాల ప్రారంభం**
- **కమిషనరేట్‌లో మరో 700 కెమెరాల ఏర్పాటే లక్ష్యం**



**జమ్మికుంట టౌన్ జూలై 09 (తెలంగాణ ముచ్చట్లు):** శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పేర్కొన్నారు. హుజురాబాద్ డివిజన్ పరిధిలోని సైదాబాద్ గ్రామంలో 16, కొరపల్లి గ్రామంలో 5 చొప్పున మొత్తం 21 నూతన సీసీ కెమెరాలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే జమ్మికుంటలో నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ప్రతి గ్రామం, పట్టణాన్ని సీసీ కెమెరాల నిఘాలోకి తీసుకురావడమే లక్ష్యమని, త్వరలో మరో 700 కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం యువత భవిష్యత్తుకు ముప్పుగా మారుతున్నాయని, తల్లిదండ్రులు పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, అనుమానాస్పద సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రహవీర్' పథకం కింద రూ.25 వేల నగదు బహుమతి అందజేస్తుందని ప్రజలకు వివరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సైదాబాద్, కొరపల్లి గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులకు సీపీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట సీఐ రామకృష్ణ, రూరల్ సీఐ వెంకట్, ఎస్సైలు ఆవుల తిరుపతి, స్వాతి, క్రాంతి, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలి





- **హుజురాబాద్ ఏసీపీ కార్యాలయంలో సీపీ గౌష్ ఆలం సమీక్ష సమావేశం**

**హుజురాబాద్, జూలై 9(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా వేగవంతంగా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం అధికారులను ఆదేశించారు. గురువారం హుజురాబాద్ ఏసీపీ కార్యాలయంలో హుజురాబాద్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సీసీసీ ఫిర్యాదులపై ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని వెంటనే విచారణ చేపట్టి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించి బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు.
శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడంతో పాటు ప్రతి కేసును నిష్పక్షపాతంగా విచారించి చట్టబద్ధంగా ముగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.
ఈ సమీక్షా సమావేశంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, సీఐలు కరుణాకర్, వెంకట్, రామకృష్ణ, ఎస్సైలు శేఖర్, క్రాంతి, స్వాతి తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






# రైతు, కార్మిక వ్యతిరేక నిర్ణయాలపై ఉమ్మడి పోరాటానికి పిలుపు

- **మూడో డిస్కం రద్దు చేయాలి.. లేబర్ కోర్టులు కొనసాగించాలి**

**హుజురాబాద్, జూలై 9(తెలంగాణ ముచ్చట్లు ):** రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రైతు విద్యుత్ మూడో డిస్కం (థర్డ్ డిస్కం) ప్రతిపాదనను రద్దు చేయడంతో పాటు కార్మికుల హక్కులను పరిరక్షించే లేబర్ కోర్టులను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ హుజురాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సంయుక్త సదస్సులో ప్రభుత్వాలకు హెచ్చరిక చేశారు.
ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము మాట్లాడుతూ రైతులకు తీవ్ర నష్టం కలిగించే మూడో డిస్కం ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని అన్నారు. వ్యవసాయ విద్యుత్‌ను కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి తీసుకెళ్లే చర్యలను రైతాంగం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని స్పష్టం చేశారు. కార్మికుల న్యాయ హక్కులను పరిరక్షించే లేబర్ కోర్టులను రద్దు చేయకుండా కొనసాగించాలని, కార్మిక వ్యతిరేక నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే గ్రామీణ పేదలకు జీవనాధారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలను నిలిపివేసి, యథాతథంగా కొనసాగించాలని కోరారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కదిరే రమేష్, దండిగారి సతీష్, ఇమ్మడి దేవయ్య, కొడిమెల వెంకటేష్, ఆకునూరి సుధాకర్, శనిగరపు కొమురయ్య, నవీన్, శ్రీకాంత్, ఉమా, మాట్ల చిరంజీవి, మహేష్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## కనీస అభ్యాస సామర్థ్యాలే విద్యార్థి విజయానికి బలమైన పునాది



- మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ

**ఎల్కతుర్తి, జులై 9(తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామంలో, విద్యార్థుల విజయానికి కనీస అభ్యాస సామర్థ్యాలే బలమైన పునాది అని మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ అన్నారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక నైపుణ్యాలు పెంపొందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.
మండల పరిధిలోని సూరారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి కనీస అభ్యాస సామర్థ్యాలను సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన నిర్వహించాలని, ముఖ్యంగా చదవడం, రాయడం, గణితంలో బేసిక్ కాన్సెప్ట్స్‌పై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల రిజిస్టర్లు, విద్యార్థుల హాజరు నమోదులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేసి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. అలాగే ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హర్షవర్ధన్ రెడ్డితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన నాగరాజును అభినందించిన పలుస శంకర్ గౌడ్



**వనపర్తి,జూలై09(తెలంగాణ ముచ్చట్లు):** రక్తదానం చేయడం అంటే ఒకరి ప్రాణాన్ని కాపాడినట్లేనని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.గురువారం 28వ సారి రక్తదానం చేసిన తన శిష్యుడు నాగరాజును అభినందించి రక్తదాన ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ..రక్తదానం మహోన్నతమైన సేవ అని,ప్రతి ఆరోగ్యవంతుడు సంవత్సరానికి కనీసం రెండుసార్లు రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం వల్ల దాత ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని, అదే సమయంలో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పలువురి ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ జీవితంలో రక్తదానాన్ని అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జైభీమ్ సేవా సంఘం అధ్యక్షుడు బండారు శ్రీనివాస్, కవి కంటే నిరంజనయ్య తదితరులు పాల్గొన్నారు.

## దిండు రవీందర్‌ను సన్మానించిన వెల్టూర్ మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్



**ఖిల్లా ఘనపూర్,జూలై 09 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం-పెద్దమందడి వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా నియమితులైన దిండు రవీందర్‌ను వెల్టూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్ మర్యాదపూర్వకంగా సన్మానించారు.ఈ సందర్భంగా .. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దిండు రవీందర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, అభిమానులు పాల్గొని దిండు రవీందర్‌ను అభినందించారు.

# రైతుల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తా

- మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కొత్తకాపు వెంకటేశ్వర్ రెడ్డి



**ఖిల్లా ఘణపూర్ ,జూలై 09తెలంగాణ ముచ్చట్లు):** ఖిల్లా ఘణపురం-పెద్దమందడి వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం తనకు దక్కిన గౌరవమే కాకుండా బాధ్యత కూడా అని వైస్ చైర్మన్ కొత్తకాపు వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలో నిర్వహించిన నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తనపై విశ్వాసం ఉంచి ఈ పదవికి అవకాశం కల్పించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి, పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. రైతుల అభ్యున్నతే తన ప్రధాన లక్ష్యమని, పాలకవర్గ సభ్యులతో సమన్వయంగా పనిచేస్తూ మార్కెట్ యార్డులో పారదర్శక పాలన అందిస్తానని తెలిపారు. రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర పొందేలా, మార్కెట్ యార్డులో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రైతు సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయడంలో తన వంతు బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, నూతన పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల హక్కుల కోసం నిరంతర పోరాటమే ఏబీవీపీ లక్ష్యం

- హుజురాబాద్‌లో విద్యార్థుల భారీ ర్యాలీ



**హుజురాబాద్, జూలై 9(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణంలో గురువారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో జాతీయ జెండాలు, ఏబీవీపీ జెండాలు పట్టుకుని "భారత్ మాతాకీ జై", "వందే మాతరం" నినాదాలతో విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ పట్టణ ప్రజలను ఆకట్టుకుని దేశభక్తి స్ఫూర్తిని చాటింది. ర్యాలీ అనంతరం నిర్వహించిన సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబిలాష్ మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కొద్ది మంది విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ నేడు 78 లక్షల మందికి పైగా సభ్యత్వం కలిగిన ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగిందని పేర్కొన్నారు.
విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ ఎన్నో ఉద్యమాలు చేపట్టి అనేక విజయాలు సాధించిందని తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల హక్కుల పరిరక్షణ, జాతీయతా భావం పెంపొందించడం వంటి లక్ష్యాలతో సంస్థ నిరంతరం పనిచేస్తోందన్నారు. దేశం కోసం, విద్యార్థి సమాజం కోసం పోరాడుతూ ఎంతోమంది ఏబీవీపీ కార్యకర్తలు "భారత్ మాతాకీ జై" అంటూ ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు.
దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంతో విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ విద్యార్థి దినోత్సవం విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించే వేదికగా నిలుస్తుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ సంయుక్త కార్యదర్శులు సాయి చరణ్, అజయ్, పట్టణ ఉపాధ్యక్షులు రాజు, ఆదిత్య, మణి, ప్రీతమ్, రాంచరణ్, ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# పాలేరు దివ్య క్షేత్రాలలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనలు

- ఈశ్వరమాధారం... హస్నాబాద్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పొంగులేటి సతీమణి శ్రీమతి పొంగులేటి మాధురి

**ఖమ్మం బ్యూరో, జులై 9(తెలంగాణ ముచ్చట్లు ):** పాలేరు నియోజకవర్గ పరిధిలో గురువారం ఆధ్యాత్మిక సౌరభం వెల్లివిరిసింది. కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో అత్యంత వైభవంగా నిర్వహించిన నూతన ఆలయాల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సతీమణి శ్రీమతి పొంగులేటి మాధురి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**శాస్త్రోక్తంగా మాధారేశ్వరుని ప్రతిష్ఠ...**
కూసుమంచి మండలం ఈశ్వరమాధారంలో శ్రీ పార్వతీ సమేత ఈశ్వర మాధారేశ్వర స్వామి వారి శివలింగ, ధ్వజస్తంభ, చండీశ్వర ప్రతిష్ఠాపనలు శాస్త్రోక్తంగా సంపన్నమయ్యాయి. వీటితో పాటు నవగ్రహ, నాగేంద్రస్వామి, గ్రామ దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మూడవ రోజు వేడుకల్లో భాగంగా జరిగిన వేదమంత్ర హోమాలు, స్థిర యంత్ర స్థాపన, మహా పూర్ణాహుతి క్రతువుల్లో పాల్గొన్న పొంగులేటి మాధురికి అర్చకులు స్వాగతం పలికి వేదాశీర్వచనం అందించారు.

**హస్నాబాద్‌లో సీతారాముల కలశ ప్రతిష్ఠ.. బచ్చోడులో దర్శనం...**
తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ సీతా సమేత శ్రీ రామాంజనేయ స్వామి వారి ఆలయ ధ్వజస్తంభ, శిఖర కలశ ప్రతిష్ఠాపన ముగింపు వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ పర్యటనలో భాగంగానే బచ్చోడు గ్రామంలోని మహిమాన్విత శ్రీ రామాలయాన్ని కూడా ఆమె సందర్శించి తారకరాముని దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకున్నారు.

**నూతన వధూవరులకు ఆశీస్సులు...**
అదేవిధంగా పాలేరు గ్రామంలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని పొంగులేటి మాధురి నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టు వస్త్రాలను కానుకగా బహూకరించారు.

## ఓటర్లకు ఎస్ఐఆర్‌పై అవగాహన.. ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ

**పెద్దమందడి,జూలై09(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 63వ బూత్‌లో ఓటర్లకు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. బీఎల్ఏ2 మల్లికార్జున్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు దయ్యాల దాసు, మద్దూరు వెంకటయ్య ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఫారాలు అందజేసి, వాటిని సక్రమంగా ఎలా నింపాలో వివరించారు.ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు తప్పనిసరిగా పాల్గొని తన వివరాలను ధ్రువీకరించుకోవాలని సూచించారు. ఓటర్లకు అవసరమైన సందేహాలను నివృత్తి చేస్తూ.. సరైన పత్రాలతో ఫారాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని అవగాహన కల్పించారు.



తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శుక్రవారం - 10 - జూలై 2026


# జూలై 10న చింతకానిలో భారీ రైతు ఆశీర్వాద సభ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- 3 లక్షల మంది రైతులు హాజరవుతారని అంచనా
- సభకు ప్రతి రైతు హాజరై ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పిలుపు
- 9 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ
- వ్యవసాయ, అనుబంధ రంగాల కోసం 1,67,877 కోట్లు వ్యయం
- రైతు భరోసా, ఆశీర్వాద సభ ఏర్పాట్లపై మీడియా సమావేశం నిర్వహించిన డిప్యూటీ సీఎం



**ఖమ్మం బ్యూరో, జులై 9(తెలంగాణ ముచ్చట్లు ):** జూలై 10 న ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురం గ్రామం మత్కే పల్లి క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. గురువారం చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో డిప్యూటీ సీఎం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి రైతు భరోసా ఆశీర్వాద సభపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ వానాకాలం పంట సీజన్‌కు సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా పెట్టుబడి సహాయాన్ని అందించిన నేపథ్యంలో జూలై 10న రైతు ఆశీర్వాద సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 3 లక్షల మంది రైతులు ఈ సభకు హాజరవుతారని అంచనా వేస్తున్నామని తెలిపారు. ప్రతి రైతు ఈ కార్యక్రమానికి విచ్చేసి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. రైతులే రాష్ట్రానికి వెన్నెముక అని రైతులకు ప్రతి అడుగులో అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని చెప్పారు.గత ప్రభుత్వం రైతు భరోసా పథకం క్రింద పదేళ్లలో మొత్తం రూ.72 వేల కోట్లు మాత్రమే అందించిందని తమ ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే రైతు భరోసా క్రింద రూ.35,830 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటివరకు ఒక లక్ష 67 వేల 877 కోట్లను వెచ్చించిందన్నారు. రైతు రుణమాఫీ ధాన్యానికి బోనస్ పంటల బీమా పంట నష్టపరిహారం ఉచిత విద్యుత్ విద్యుత్ సబ్సిడీ వ్యవసాయ యాంత్రీకరణ వంటి పలు రైతు సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఈ నిధులను వినియోగించినట్లు వివరించారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్నామని వెల్లడించారు.ఖమ్మం జిల్లా అంటేనే వ్యవసాయానికి ప్రతీక అని నాగార్జునసాగర్ వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో ఈ ప్రాంతం వ్యవసాయాభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని భవిష్యత్తులో రైతులకు మరింత మేలు చేసే కార్యక్రమాలను అమలు చేస్తామని రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు.
ముఖ్యమంత్రి పాల్గొనే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయడంలో మీడియా ప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో మీడియా ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో మళ్లీ ఫుడ్ పాయిజనింగ్... ఇకనైనా ప్రభుత్వం మేల్కొంటుందా?

- గురుకులాల్లో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆపాలి
- నాగర్‌కర్నూల్ గురుకులంలో అస్వస్థతకు గురైన విద్యార్థులు
- పునరావృతమవుతున్న ఘటనలపై తీవ్ర ఆందోళన
- ఆహార నాణ్యత, పర్యవేక్షణపై ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి



**హైదరాబాద్, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో గురుకుల విద్యాసంస్థల్లో వరుసగా వెలుగుచూస్తున్న ఆహార భద్రత సమస్యలు మరోసారి ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో అల్పాహారం తీసుకున్న అనంతరం పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడం విద్యార్థుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో బాధపడిన విద్యార్థులను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై అధికారులు విచారణ ప్రారంభించారు. గురుకులాల్లో ఇలాంటి ఘటనలు ఇదే తొలిసారి కావు. గతంలోనూ రాష్ట్రంలోని పలు గురుకులాలు, వసతి గృహాల్లో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రతి ఘటన తర్వాత విచారణలు, అధికారుల బదిలీలు, కమిటీల నియామకంతో సరిపెట్టడం తప్ప శాశ్వత పరిష్కారం కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యానికి ఏమాత్రం తావు ఉండకూడదని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. పేద, గిరిజన, వెనుకబడిన కుటుంబాల పిల్లలు చదువుకునే గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత. వంటశాలల పరిశుభ్రత, తాగునీటి నాణ్యత, నిల్వ ఉంచే ఆహార పదార్థాల గడువు, వంట చేసే సిబ్బంది ఆరోగ్య పరీక్షలు, ఆహార నమూనాల పరీక్షలను ప్రతిరోజూ తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉంది. కేవలం తనిఖీల పేరుతో కాకుండా శాశ్వత పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రతి గురుకులంలో జిల్లా స్థాయి ప్రత్యేక తనిఖీ బృందాలు నెలకు కనీసం రెండుసార్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. విద్యార్థులు, తల్లిదండ్రులు నేరుగా ఫిర్యాదు చేసే ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి. నిబంధనలు ఉల్లంఘించిన కాంట్రాక్టర్లు, సిబ్బంది, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకునే విధానాన్ని అమలు చేయాలి. విద్యార్థుల ప్రాణాల కంటే విలువైనది ఏదీ లేదు. ప్రతి ఘటన తర్వాత స్పందించడం కాకుండా, మరో ఘటన జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత. గురుకులాలు భద్రత, పరిశుభ్రత, నాణ్యమైన ఆహారానికి ఆదర్శంగా నిలవాలే గానీ, తల్లిదండ్రులను భయాందోళనలకు గురిచేసే కేంద్రాలుగా మారకూడదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనను హెచ్చరికగా తీసుకుని గురుకులాల నిర్వహణలో సమగ్ర సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# నగరాల్లో తగ్గుతున్న పచ్చదనం... పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

**డెస్క్, జూలై 9 (తెలంగాణ ముచ్చట్లు):** ఒకప్పుడు చెట్లు, పార్కులు, చెరువులు, ఖాళీ ప్రదేశాలతో ఆహ్లాదకరంగా కనిపించిన నగరాలు నేడు కాంక్రీట్ అడవులుగా మారుతున్నాయి. జనాభా పెరుగుదల, వేగవంతమైన పట్టణీకరణ, భారీ నిర్మాణాలు, రహదారి విస్తరణ, చెట్ల నరికివేత కారణంగా నగరాల్లో పచ్చదనం రోజురోజుకూ తగ్గిపోతోంది. దాని ప్రభావం ఉష్ణోగ్రతల రూపంలో స్పష్టంగా కనిపిస్తోంది. గతంతో పోలిస్తే నగరాల్లో వేసవి కాలం మరింత తీవ్రంగా మారుతుండగా, రాత్రి వేళల్లో కూడా ఉష్ణోగ్రతలు ఆశించిన స్థాయిలో తగ్గడం లేదు. దీని వల్ల ప్రజల ఆరోగ్యం, జీవన విధానం, విద్యుత్ వినియోగం, పర్యావరణ సమతుల్యతపై తీవ్ర ప్రభావం పడుతోంది. పట్టణ ప్రాంతాల్లో సిమెంట్ భవనాలు, తారు రహదారులు, భారీ వాణిజ్య సముదాయాలు వేడిని ఎక్కువగా గ్రహించి ఎక్కువసేపు నిల్వ ఉంచుతాయి. దీని వల్ల నగరాల్లో "వేడి ద్వీపాల" పరిస్థితి ఏర్పడుతోంది. చుట్టుపక్కల గ్రామాల కంటే నగరాల్లో ఉష్ణోగ్రతలు అనేక సందర్భాల్లో రెండు నుంచి ఐదు డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయి. ఈ పరిస్థితి వేసవిలో మాత్రమే కాకుండా ఇతర కాలాల్లో కూడా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. చెట్లు తగ్గిపోవడంతో గాలి నాణ్యత కూడా క్షీణిస్తోంది. వాహనాల నుంచి వెలువడే కాలుష్య వాయువులు, పరిశ్రమల ఉద్గారాలు, నిర్మాణ ప్రాంతాల నుంచి ఎగిసే దుమ్ము వాతావరణాన్ని మరింత కలుషితం చేస్తున్నాయి. చెట్లు సహజ వాయు శుద్ధి కేంద్రాలుగా పనిచేస్తాయి. అవి కార్బన్ డైఆక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేయడంతో పాటు ఉష్ణోగ్రతలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పచ్చదనం తగ్గితే ఈ సహజ రక్షణ వ్యవస్థ కూడా బలహీనపడుతుంది. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ప్రజల ఆరోగ్యంపై తీవ్రంగా పడుతోంది. వడదెబ్బలు, నీరసం, గుండె సంబంధిత సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు, వృద్ధులు, చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. వేడి నుంచి ఉపశమనం కోసం శీతలీకరణ పరికరాల వినియోగం అధికమవుతుండటంతో విద్యుత్ డిమాండ్ కూడా రికార్డు స్థాయికి చేరుతోంది. ఇది మరోవైపు విద్యుత్ ఉత్పత్తిపై అదనపు ఒత్తిడిని తీసుకొస్తోంది. పచ్చదనం తగ్గిపోవడం వల్ల వర్షపాతం విధానాలపై కూడా ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. చెరువులు, పార్కులు, ఖాళీ భూములు క్రమంగా అంతరించిపోవడంతో భూగర్భ జలాల పునరుద్ధరణ తగ్గుతోంది. వర్షం వచ్చినా నీరు భూమిలోకి ఇంకకుండా నేరుగా రోడ్లపై ప్రవహించి వరదలకు దారితీస్తోంది. ఒకవైపు నీటి కొరత, మరోవైపు పట్టణ వరదలు నగరాల ముందున్న పెద్ద సవాళ్లుగా మారుతున్నాయి. నగరాల అభివృద్ధి పేరుతో చెట్లను తొలగించడం కంటే వాటిని సంరక్షిస్తూ అభివృద్ధి పనులు చేపట్టడం అవసరం. ప్రతి కొత్త నిర్మాణానికి తగినంత హరిత ప్రాంతాన్ని తప్పనిసరి చేయడం, రహదారుల వెంట నీడనిచ్చే చెట్లను నాటడం, పార్కులను అభివృద్ధి చేయడం, చెరువులను పరిరక్షించడం వంటి చర్యలు అత్యవసరం. ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా చెట్ల సంరక్షణను తమ బాధ్యతగా భావించాలి. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ఒక కార్యక్రమం కాదు, భవిష్యత్ తరాలకు ఇచ్చే భద్రత. నగరాల్లో పచ్చదనం పెరిగితేనే ఉష్ణోగ్రతలు తగ్గుతాయి, గాలి నాణ్యత మెరుగుపడుతుంది, వర్షపాతం సమతుల్యంగా ఉంటుంది, ప్రజల ఆరోగ్యం కాపాడబడుతుంది. ప్రతి మొక్కను ఒక జీవరక్షకుడిగా భావించి సంరక్షించినప్పుడే నగరాలు మళ్లీ ఆహ్లాదకరమైన జీవనానికి నిలయాలుగా మారగలవు.

# శక్తిని ఆదా చేద్దాం... భవిష్యత్తును భద్రపరుచుకుందాం

**డెస్క్, జూలై 9 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి సంవత్సరం జూలై 10న ప్రపంచ శక్తి స్వావలంబన దినాన్ని నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ అవసరాలు, శిలాజ ఇంధనాల నిల్వలు తగ్గిపోతుండటం, వాతావరణ మార్పులు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ప్రాధాన్యాన్ని గుర్తు చేయడమే ఈ దినోత్సవం లక్ష్యం. బొగ్గు, చమురు, సహజవాయువు వంటి ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించి సౌరశక్తి, పవనశక్తి, జలవిద్యుత్, జీవ ఇంధనాల వంటి పునరుత్పాదక శక్తి వనరులను విస్తృతంగా వినియోగించాల్సిన అవసరాన్ని ఈ రోజు ప్రపంచానికి గుర్తు చేస్తుంది. శక్తి స్వావలంబన అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మాత్రమే కాదు. ఒక దేశం తన శక్తి అవసరాలను స్వదేశీ వనరులతో తీర్చుకోగలగడం, విదేశీ ఇంధనాలపై ఆధారపడకుండా ఆర్థికంగా బలపడడం, పర్యావరణాన్ని పరిరక్షించడం కూడా ఇందులో భాగమే.



ప్రస్తుతం ప్రపంచంలోని చాలా దేశాలు చమురు దిగుమతులపై భారీగా ఆధారపడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగిన ప్రతిసారి ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోంది. విద్యుత్ ఉత్పత్తి ఖర్చులు పెరగడంతో పాటు రవాణా, పరిశ్రమలు, వ్యవసాయం, గృహ అవసరాలన్నింటిపైనా అదనపు భారం పడుతోంది. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే ప్రతి దేశం స్థానికంగా లభించే పునరుత్పాదక శక్తి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలి. అందుకే ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు స్వచ్ఛమైన శక్తి ఉత్పత్తిపై భారీ పెట్టుబడులు పెడుతున్నాయి. భవిష్యత్తులో ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కోవాలంటే ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.
భారతదేశం కూడా శక్తి స్వావలంబన దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద సౌర విద్యుత్ ఉత్పత్తి దేశాలలో ఒకటిగా ఎదుగుతున్న భారత్, పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని ప్రతి ఏడాది గణనీయంగా పెంచుతోంది. సౌర పార్కులు, పవన విద్యుత్ కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ పంపులు, ఇంటి పైకప్పులపై సౌర విద్యుత్ వ్యవస్థలు, విద్యుత్ వాహనాల ప్రోత్సాహం వంటి అనేక కార్యక్రమాలు ఈ దిశగా సాగుతున్నాయి. విద్యుత్ ఉత్పత్తిలో స్వదేశీ వనరుల వినియోగం పెరగడం వల్ల దిగుమతి ఇంధనాలపై ఆధారపడటం తగ్గి దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. శక్తి స్వావలంబనలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోంది. ఆధునిక సౌర ఫలకాలు, అధిక సామర్థ్యం కలిగిన పవన టర్బైన్లు, శక్తి నిల్వ చేసే బ్యాటరీలు, స్మార్ట్ విద్యుత్ పంపిణీ వ్యవస్థలు విద్యుత్ వినియోగాన్ని మరింత సమర్థవంతంగా మార్చుతున్నాయి. కృత్రిమ మేధస్సు ఆధారిత విద్యుత్ నిర్వహణ వ్యవస్థలు అవసరానికి అనుగుణంగా విద్యుత్ సరఫరాను నియంత్రించి వృథాను తగ్గిస్తున్నాయి. భవిష్యత్తులో గ్రీన్ హైడ్రోజన్, సముద్ర అలల ద్వారా విద్యుత్ ఉత్పత్తి, అధునాతన శక్తి నిల్వ సాంకేతికతలు మరింత కీలకంగా మారనున్నాయి.
పర్యావరణ పరిరక్షణలో శక్తి స్వావలంబనకు అత్యంత కీలక స్థానం ఉంది. బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాలను అధికంగా వినియోగించడం వల్ల కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాలు పెరిగి భూతాపం తీవ్రత అధికమవుతోంది. మంచు పర్వతాలు కరుగడం, సముద్ర మట్టం పెరగడం, కరువు, వరదలు, తీవ్ర వర్షాలు, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి అనేక ప్రకృతి వైపరీత్యాలకు ఇది ప్రధాన కారణంగా మారుతోంది. పరిశుభ్రమైన శక్తి వనరుల వినియోగం పెరిగితే కార్బన్ ఉద్గారాలు తగ్గి ప్రకృతి సమతుల్యతను కాపాడే అవకాశం ఉంటుంది. అందువల్ల శక్తి స్వావలంబన అనేది పర్యావరణ పరిరక్షణకు కూడా బలమైన ఆయుధంగా నిలుస్తోంది.
ప్రజల పాత్ర లేకుండా శక్తి స్వావలంబన సాధ్యం కాదు. ప్రతి కుటుంబం విద్యుత్ పొదుపును ఒక బాధ్యతగా భావించాలి. అవసరం లేని సమయంలో విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, శీతలీకరణ పరికరాలను నిలిపివేయడం, విద్యుత్ ఆదా చేసే పరికరాలను వినియోగించడం, సహజ కాంతి, గాలి ఎక్కువగా ఉపయోగించుకోవడం, సౌర నీటి హీటర్లు, సౌర దీపాలను వినియోగించడం వంటి అలవాట్లు పెంపొందించుకోవాలి. చిన్న చిన్న మార్పులు లక్షలాది కుటుంబాల్లో అమలైతే దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో విద్యుత్ పొదుపు సాధ్యమవుతుంది. వ్యవసాయ రంగంలో కూడా పునరుత్పాదక శక్తి వినియోగం వేగంగా పెరుగుతోంది. సౌరశక్తితో నడిచే నీటి పంపులు రైతులకు విద్యుత్ ఖర్చును తగ్గిస్తున్నాయి. బయోగ్యాస్ ద్వారా వంటగ్యాస్, విద్యుత్ ఉత్పత్తి గ్రామీణ ప్రాంతాల్లో మంచి ప్రత్యామ్నాయంగా మారుతోంది. వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి జీవ ఇంధనాల తయారీ వల్ల రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు వ్యర్థాల నిర్వహణ సమస్య కూడా తగ్గుతోంది. పునరుత్పాదక శక్తి గ్రామీణాభివృద్ధికి కొత్త అవకాశాలను తీసుకువస్తోంది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## సబ్‌స్క్రిప్షన్‌పై అపోహలు వద్దు.. పాయల్ రాజ్‌పుత్ స్పష్టీకరణ

సినీ నటి పాయల్ రాజ్‌పుత్ తన సామాజిక మాధ్యమ సబ్‌స్క్రిప్షన్ వేదికపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలకు తెరదించింది. ఇటీవల ప్రముఖులు అభిమానులతో మరింత చేరువ కావడానికి ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్ వేదికలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో, తాను ప్రారంభించిన వేదిక గురించి వస్తున్న అపోహలపై ఆమె స్పందించింది. తన సబ్‌స్క్రిప్షన్ వేదికలో ఎలాంటి విషయాలు పంచుకోబోతున్నానని చాలా మంది సందేశాలు పంపుతున్నారని, అందుకే అందరికీ ఒకేసారి స్పష్టత ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు పాయల్ వెల్లడించింది. కేవలం అసభ్యకరమైన లేదా అతిగా గ్లామర్‌కు సంబంధించిన చిత్రాలు, వీడియోలు ఉంటాయనే ఉద్దేశంతో ఎవరూ తన వేదికలో చేరవద్దని ఆమె స్పష్టం చేసింది. అలాంటి కంటెంట్‌ను తాను ఎప్పటికీ అందించబోనని తేల్చి చెప్పింది. ఈ వేదికను ఒక నటిగా కాకుండా, తన నిజ జీవితాన్ని అభిమానులతో పంచుకునేందుకే ప్రారంభించినట్లు పాయల్ వివరించింది. షూటింగ్‌ల వెనుక జరిగే విషయాలు, రోజువారీ జీవితం, తన ఆలోచనలు, అనుభవాలు, సహజమైన క్షణాలను అభిమానులకు చేరవేయడమే ఈ వేదిక లక్ష్యమని పేర్కొంది. తన వ్యక్తిత్వాన్ని గౌరవిస్తూ, వ్యక్తిగత హద్దులను అర్థం చేసుకునే అభిమానులకే ఈ వేదిక ఉద్దేశించినదని పాయల్ తెలిపింది. ఒక మహిళగా, నటిగా తన గోప్యతను గౌరవిస్తున్న ప్రతి అభిమానికి ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. తనపై తప్పుడు ప్రచారాలను నమ్మకుండా, నిజమైన ఉద్దేశాన్ని అర్థం చేసుకోవాలని అభిమానులను ఆమె కోరింది.




## మిస్టికల్ థ్రిల్లర్ 'అగాధ' రిలీజ్ డేట్ ఖరారు..

టాలీవుడ్ ప్రముఖ సీనియర్ దర్శకుడు, నిర్మాత ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ చిత్రం 'అగాధ' విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించిన ఈ సినిమా ఎం.ఎస్. రాజు కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తోంది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, జోవిక విజయ్‌కుమార్, ఉల్కా గుప్తా ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది.

తాజాగా విడుదల చేసిన పవర్‌ఫుల్ పోస్టర్‌తో పాటు, ఈ చిత్రాన్ని ఆగస్టు 14న స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. శ్రీ ఆది వరాహ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎం.ఎస్. రాజు స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వ బాధ్యతలను కూడా నిర్వర్తిస్తున్నారు.

చిత్ర కథాంశాన్ని ఇప్పటికీ రహస్యంగానే ఉంచిన మేకర్స్, టీజర్ ద్వారా మాత్రం ప్రేక్షకులను ఒక కొత్త మిస్టరీ ప్రపంచంలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఫాంటసీ అంశాలతో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో ఆసక్తికరమైన మలుపులు, విభిన్నమైన కథనం ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

ఇప్పటికే టీజర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. విడుదల తేదీ ఖరారైన నేపథ్యంలో త్వరలోనే ట్రైలర్, పాటలు, ఇతర ప్రచార కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. విభిన్న కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రానున్న 'అగాధ' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాల్సి ఉంది.



## నవీన్ పోలిశెట్టి సరదా వ్యాఖ్యలు..

టాలీవుడ్ యువ హీరో నవీన్ పోలిశెట్టి మరోసారి తన హాస్య చతురతతో అందరినీ ఆకట్టుకున్నారు. తెరపై కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించే ఆయన, నిజ జీవితంలోనూ తన సరదా మాటలతో నవ్వులు పంచారు. హైదరాబాద్‌లో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదో తెలంగాణ పోలీస్ క్రీడలు, క్రీడోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నవీన్ చేసిన వ్యాఖ్యలు సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ సందర్భంగా ఇటీవల మహిళల భద్రత కోసం మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి నిర్వహించిన అండర్‌కవర్ ఆపరేషన్‌ను ప్రస్తావిస్తూ ఆమె పనితీరును ప్రశంసించారు. సరదాగా స్పందించిన నవీన్, "సుమతి మేడమ్ చాలా బాగా నటించారు. నా తదుపరి సినిమాలో ఆమె తప్పకుండా నటించాలి. నేను, సుమతి మేడమ్ కలిసి 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'కు కొనసాగింపుగా వచ్చే సినిమాలో ఒక కేసును ఛేదిస్తే బాగుంటుంది" అని వ్యాఖ్యానించడంతో సభలో నవ్వులు వెల్లువెత్తాయి.

కార్యక్రమంలో మరో ఆసక్తికర సంఘటన కూడా చోటు చేసుకుంది. అక్కడున్న పోలీస్ అధికారులను ఉద్దేశించి "సార్... నాకు తుపాకీ ఎలా పట్టుకోవాలో నేర్పించండి" అని నవీన్ కోరారు. దీనికి స్పందించిన రాష్ట్ర పోలీస్ శాఖ ఉన్నతాధికారి సీవీ ఆనంద్, "శిక్షణ ఇస్తాం కానీ అసలు బుల్లెట్లతో మాత్రం కాదు" అని సరదాగా వ్యాఖ్యానించారు. వెంటనే స్పందించిన నవీన్, "మా సినిమాల్లో అన్నీ నకిలీ బుల్లెట్లే ఉంటాయి సార్... అయినా నాకు తుపాకీ పట్టడం కూడా రాదు" అని చెప్పడంతో సభలో ఉన్న అధికారులు, అతిథులు గట్టిగా నవ్వారు.

ఈ సందర్భంగా తన అభిమానులకు నవీన్ మరో శుభవార్త కూడా చెప్పారు. తన సినీ జీవితంలో తొలిసారిగా పోలీస్ అధికారి పాత్రలో నటించబోతున్నట్లు వెల్లడించారు. మంచి కథ, బలమైన పాత్రతో ఆ పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పోలీస్ శాఖ సేవలను కొనియాడిన నవీన్, జీవితంలో కష్టసమయంలో ప్రతి ఒక్కరికీ ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులేనని అన్నారు. ప్రజల భద్రత కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పోలీస్ సిబ్బంది సేవలు ఎంతో గొప్పవని, వారి నిస్వార్థ సేవలకు తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# సీతక్కకు సీఎం శుభాకాంక్షలు

- జన్మదినం సందర్భంగా ఎక్స్‌లో ప్రత్యేక సందేశం
- ప్రజలకు అండగా నిలుస్తున్న నేతగా ప్రశంసలు
- మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్ష



**హైదరాబాద్, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా ఆమెకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న నాయకురాలిగా సీతక్కను ముఖ్యమంత్రి కొనియాడారు. ప్రజాసేవలో ఆమె మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సీతక్క ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో ప్రజాసేవను కొనసాగించాలని ముఖ్యమంత్రి తన సందేశంలో పేర్కొన్నారు. ఆమె సేవాభావం ప్రజలకు మరింత ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

ముఖ్యమంత్రి చేసిన ఈ శుభాకాంక్షల సందేశం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కూడా సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పనిచేస్తున్న సీతక్కకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆమె అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సీతక్కకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలపడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజాసేవలో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## సీతక్కకు ఏపీ సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

- జన్మదినం సందర్భంగా ఎక్స్‌లో ప్రత్యేక సందేశం
- మంత్రి లోకేశ్ కూడా శుభాకాంక్షలు
- గురుశిష్య అనుబంధం మరోసారి చర్చనీయాంశం



**అమరావతి/హైదరాబాద్, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) జన్మదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా ఇద్దరూ శుభాకాంక్షల సందేశాలను పంచుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన సందేశంలో సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో ప్రజలకు సేవలందించాలని కోరుకున్నారు. ఆమె ప్రజాసేవా దృక్పథాన్ని అభినందిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

మంత్రి నారా లోకేశ్ కూడా సీతక్కను అణగారిన వర్గాల గొంతుకగా అభివర్ణించారు. ప్రజాసంక్షేమం కోసం ఆమె నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడుతూ, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఆమె జీవితం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలోనే తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని, చంద్రబాబే తన రాజకీయ గురువని సీతక్క గతంలో పలు సందర్భాల్లో బహిరంగంగా పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటికీ, చంద్రబాబుతో తనకున్న గౌరవప్రదమైన అనుబంధం కొనసాగుతుందని ఆమె పలుమార్లు స్పష్టం చేశారు.

ప్రతి ఏడాది రాఖీ పౌర్ణమి సందర్భంగా చంద్రబాబును కలిసి రాఖీ కట్టడం ద్వారా తమ అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఈ విషయంపై రాజకీయంగా ఎలాంటి వ్యాఖ్యలు వచ్చినా తాను పట్టించుకోనని సీతక్క గతంలో వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా వ్యక్తిగత గౌరవ సంబంధాలు కొనసాగుతాయని ఆమె చెప్పిన సందర్భాలు ఉన్నాయి. వేర్వేరు రాజకీయ పార్టీల్లో ఉన్నప్పటికీ చంద్రబాబు, సీతక్క మధ్య కొనసాగుతున్న గురుశిష్య అనుబంధం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందింది. జన్మదినం సందర్భంగా చంద్రబాబు, లోకేశ్ చేసిన శుభాకాంక్షలతో ఈ అనుబంధం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## సీఎంను కలిసిన పీటీ ఉష

- మర్యాదపూర్వకంగా భేటీ అయిన ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు
- గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్ ప్రారంభోత్సవానికి హాజరు
- క్రీడల అభివృద్ధిపై చర్చ



**హైదరాబాద్, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ సంస్థ బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు పీటీ ఉష హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ముఖ్యమంత్రి వివరించారు. యువతకు మెరుగైన శిక్షణ, ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పీటీ ఉష అభినందించినట్లు సమాచారం. గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశంలోనే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయడం, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దే దిశగా పరస్పర సహకారంపై కూడా చర్చించినట్లు అధికారులు తెలిపారు.

# గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలి : సీతక్క

(మొదటి పేజీ తరువాయి)



గురువారం ములుగులోని లీలా గార్డెన్‌లో నిర్వహించిన గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పాలన, చట్టాలు, నిధుల వినియోగం, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, ఆర్థిక నిర్వహణ, పారదర్శక పాలనపై పూర్తి అవగాహన కల్పించేందుకే ఈ శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు తమ అధికారాలు, బాధ్యతలు, ఆర్థిక నిబంధనలపై పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. గ్రామసభలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా వార్షిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు.

16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. టైడ్ ఫండ్స్, అన్‌టైడ్ ఫండ్స్, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, గ్రామ పంచాయతీల స్వంత ఆదాయ వనరులకు సంబంధించిన నిబంధనలను పూర్తిగా తెలుసుకుని వాటి ఉద్దేశానికి అనుగుణంగానే ఖర్చు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల స్వంత ఆదాయాన్ని పెంచేందుకు పన్నులు, ఫీజుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, తాగునీరు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, హరితహారం, గ్రామ రహదారులు, మురుగు నీటి పారుదల, ప్రజారోగ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు ప్రజలకు చేరువవుతాయని సీతక్క తెలిపారు. గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధి దిశగా తీర్చిదిద్దేందుకు ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్, ములుగు జిల్లా ప్రత్యేక అధికారి సురేష్‌బాబు, అధికారులు, సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు

- క్యాంపు కార్యాలయంలో కలెక్టర్, ఎస్పీ మర్యాదపూర్వక భేటీ
- పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు

**ములుగు, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) జన్మదినం సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం శుభాకాంక్షల కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని కోరుతూ తమ శుభాకాంక్షలను తెలియజేశారు. మంత్రి కూడా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్, డీఎస్పీ రవీందర్, సీఐలు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆత్మీయ వాతావరణంలో కార్యక్రమం కొనసాగింది. మంత్రి సీతక్క ప్రజాసేవలో అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా పలువురు అధికారులు అభినందించారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమం, తాగునీటి రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ప్రస్తావించారు.



జన్మదిన వేడుకలు నిరాడంబరంగా నిర్వహించగా, అధికారులు, ప్రజాప్రతినిధులు మంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేయాలని ఆకాంక్షించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం ఆత్మీయంగా సాగింది. అధికారులు మంత్రికి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమె సేవలను కొనియాడారు.

# ప్రతి భూమికి భూధార్ నంబర్

- 70 గ్రామాల్లో భూముల రీ సర్వే ప్రారంభం
- ఆధునిక సాంకేతికతతో సరిహద్దుల నిర్ధారణ
- భూ భారతి దరఖాస్తుల సత్వర పరిష్కారానికి ఆదేశాలు



**హైదరాబాద్, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలోని ప్రతి భూమికి ప్రత్యేకమైన భూధార్ గుర్తింపు సంఖ్య కేటాయించే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించనుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూముల రీ సర్వే, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, సర్వేయర్ల శిక్షణ, సాంకేతిక ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సమావేశంలో పాల్గొన్నారు. మొదటి దశలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి భూముల రీ సర్వే చేపట్టనున్నట్లు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి భూమి సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించి, ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయిస్తామని వెల్లడించారు. దీంతో భూ రికార్డుల్లో పారదర్శకతతో పాటు వివాదాల పరిష్కారం కూడా సులభతరం అవుతుందని పేర్కొన్నారు.

రీ సర్వే ప్రారంభానికి ముందు గ్రామసభలు నిర్వహించి రైతులు, భూ యజమానులకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సర్వేయర్లకు సమగ్ర శిక్షణ ఇచ్చిన తర్వాతే క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా రీ సర్వే నిర్వహించేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భూ భారతి దరఖాస్తులు 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉండకుండా నిర్ణీత గడువులో పరిష్కరించాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక రెవెన్యూ సేవలు అందించేందుకు అన్ని జిల్లాల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సమావేశంలో మాట్లాడిన జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్, జిల్లాలో రీ సర్వేను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, పారదర్శకంగా రీ సర్వే నిర్వహిస్తామని చెప్పారు. అలాగే భూ భారతి వెబ్‌సైట్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. భూ భారతి వెబ్‌సైట్‌లోని సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తే దరఖాస్తుల పరిశీలన మరింత వేగవంతమై ప్రజలకు సేవలు సకాలంలో అందుతాయని అధికారులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా రీ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసి భూ రికార్డులను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని సమావేశంలో వెల్లడించారు.

# హుస్నాబాద్ అభివృద్ధిపై చర్చ

- మంత్రి సురేఖతో పొన్నం ప్రభాకర్ భేటీ
- అటవీ, దేవాదాయ శాఖల అంశాలపై వినతి
- పూర్తి సహకారం అందిస్తామని హామీ

**హైదరాబాద్, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం జూబ్లీహిల్స్‌లో రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు మంత్రులు చర్చించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో అటవీ, దేవాదాయ శాఖలతో సంబంధం ఉన్న పెండింగ్ అంశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత ఫైళ్ల పురోగతిని వివరించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి తన శాఖల పరిధిలో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రంలో ప్రస్తావించిన అంశాలను సానుకూలంగా పరిశీలించి, నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు శాఖల మధ్య సమన్వయంతో పనిచేయడం అవసరమని ఇరువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. అభివృద్ధి పనుల్లో ఎదురవుతున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించనున్నట్లు తెలిపారు.

హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయడం, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సమావేశంలో నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి ప్రతిపాదనలు, శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చించినట్లు అధికారులు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయనున్నట్లు పేర్కొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మనవడి కోసం పూరీలు చేసిన సీఎం

**మనవడి కోరిక తీర్చిన రేవంత్ రెడ్డి.. స్వయంగా పూరీలు చేసి ఆప్యాయత చాటిన సీఎం.. వైరల్‌గా మారిన కుటుంబ ఆత్మీయ క్షణాలు**

**హైదరాబాద్, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మనవడిపై ఉన్న ప్రేమాభిమానాలను మరోసారి చాటుకున్నారు. నిత్యం ప్రభుత్వ కార్యక్రమాలు, పరిపాలనా బాధ్యతలతో బిజీగా ఉండే ముఖ్యమంత్రి కొంత సమయం కుటుంబ సభ్యులతో గడుపుతూ మనవడి కోరికను స్వయంగా నెరవేర్చారు. మనవడు కోరడంతో పూరీలు తయారు చేసి అతనికి అందించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

వీడియోలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనవడితో ఎంతో ఆప్యాయంగా గడుపుతూ కనిపించారు. పూరీలు తినాలన్న మనవడి కోరిక మేరకు ఆయన స్వయంగా పిండిని ఒత్తి, నూనెలో వేయించి పూరీలు తయారు చేశారు. అనంతరం మనవడికి వాటిని అందిస్తూ ముచ్చటించిన దృశ్యాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న ముఖ్యమంత్రి, "మనవడు అడిగితే కాదనగలనా? నిరంతరం ప్రజాసేవలో తలమునకలై ఉండే జీవితంలో మనవడితో కలిసి పూరీలు చేసిన ఈ మధుర క్షణాలు మరువలేనివి" అంటూ భావోద్వేగ వ్యాఖ్యను జత చేశారు.

రాజకీయాలు, పరిపాలనా బాధ్యతల మధ్య లభించే కొద్దిపాటి సమయాన్ని కుటుంబ సభ్యులతో గడపడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని రేవంత్ రెడ్డి గతంలోనూ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ముఖ్యంగా మనవడితో గడిపే క్షణాలు తనకు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని చెప్పారు. ప్రస్తుతం ఈ వీడియోకు సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ కుటుంబ బంధాలకు ప్రాధాన్యం ఇస్తూ సాధారణ తాతలా మనవడి కోరిక తీర్చిన తీరు పలువురిని ఆకట్టుకుంటోంది. రాజకీయాలకతీతంగా ఆయన కుటుంబ ఆప్యాయతను ప్రతిబింబించిన ఈ దృశ్యాలు విస్తృతంగా పంచుకుంటున్నారు.

# సంగారెడ్డిలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ప్రారంభం

- ఉచిత వైద్య సేవల విస్తరణే ప్రభుత్వ లక్ష్యం
- పరిశ్రమల కార్మికులకు మెరుగైన ఆరోగ్య సేవలు
- 104 ట్రామా కేర్ కేంద్రాల ఏర్పాటు చేస్తామన్న మంత్రి





**సంగారెడ్డి, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీని కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇప్పటికే జిల్లాలో ఏడు ఈఎస్ఐ డిస్పెన్సరీలు పని చేస్తుండగా, ఎనిమిదో డిస్పెన్సరీ ప్రారంభం కావడం సంతోషకరమని చెప్పారు.

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని రూ.200 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. జహీరాబాద్, నారాయణఖేడ్, సదాశివపేట, ఆందోల్, జోగిపేట ప్రాంతాల ప్రజలకు గుండె, మూత్రపిండాలు, చెవి-ముక్కు-గొంతు, నాడీ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, ట్రామా కేర్, నేత్ర వైద్య సేవలు వంటి సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా పీజీ సీట్లను కూడా కేటాయించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని 104 ట్రామా కేర్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను పెంచి వైద్య సేవలను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రజలకు అన్ని రకాల ఆధునిక వైద్య సేవలను ఉచితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లాలో ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు వనిత సంతోష్, అంజమ్మ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, వైద్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్మికులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిజం నాలుగో స్తంభం

- టీయూడబ్ల్యూజే మహాసభలో మంత్రి దామోదర
- విశ్వసనీయత, నైతికతే జర్నలిజం బలం
- జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి



**సంగారెడ్డి, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాస్వామ్యానికి జర్నలిజం నాలుగో స్తంభమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టీయూడబ్ల్యూజే) మహాసభలో పాల్గొన్న ఆయన, సమాజ నిర్మాణంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వార్తల ప్రసారంలో వేగం అవసరమైనప్పటికీ విశ్వసనీయత అంతకంటే ముఖ్యమని అన్నారు. సత్యం, నైతికత, సామాజిక బాధ్యతలను జర్నలిజం ఎల్లప్పుడూ పరిరక్షించాలని సూచించారు. ప్రజలకు నిష్పాక్షిక సమాచారాన్ని అందించడంలో మీడియా బాధ్యత ఎంతో కీలకమని చెప్పారు.

ప్రజల గొంతుకగా, సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తిగా మీడియా వ్యవహరించాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో విలువైనదని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందిస్తామని హామీ ఇచ్చారు. మీడియా సమాజంలో చైతన్యం తీసుకురావడంతో పాటు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వారధిగా నిలుస్తోందని మంత్రి కొనియాడారు. విలువలతో కూడిన జర్నలిజం సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. టీయూడబ్ల్యూజే మహాసభలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన జర్నలిస్టులు పాల్గొన్నారు. జర్నలిజంలో నైతిక విలువలను పరిరక్షిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

# ప్రాణం ఉన్నంతవరకు బీఆర్ఎస్‌లోకి వెళ్లేదే లేదు

- బీఆర్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన కవిత
- సింగరేణి, కాళేశ్వరం, రైతు సమస్యలపై విమర్శలు
- బీఆర్ఎస్‌లోకి తిరిగి వెళ్లేది లేదని స్పష్టం



**కొత్తగూడెం, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సింగరేణి రెండో విడత 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా గురువారం కొత్తగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తాను తిరిగి బీఆర్ఎస్‌లో చేరబోతున్నానంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోకి వెళ్లే ప్రసక్తే లేదని ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్న రూ.1,400 కోట్ల నిధులు అవినీతి ద్వారా సమకూరినవేనని ఆరోపించిన కవిత, ఆ మొత్తాన్ని తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తమ పార్టీపై భయం లేదని చెబుతూనే ఎన్నికల సంఘానికి వెయ్యికి పైగా ఫిర్యాదులు చేశారని, తమ పార్టీకి 'టీఆర్ఎస్' పేరు రాకుండా కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజా పోరాటాలను అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీజేపీలు, బీఆర్ఎస్ కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు, భూకేటాయింపులు, నిర్మాణ అనుమతుల విషయంలో కూడా కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. కేటీఆర్ తన సన్నిహితులకు అక్రమంగా అనుమతులు ఇచ్చారని, కాళేశ్వరం అవినీతిలో హరీశ్ రావు పాత్ర ఉందని ఆరోపించారు. కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం కావాలనే రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. రైతు భరోసా, ఎరువుల పంపిణీ, పంటల బోనస్ విషయంలో కూడా ప్రభుత్వం హామీలు అమలు చేయలేదని అన్నారు. సింగరేణి అంశంపై మాట్లాడుతూ సంస్థకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని కవిత ఆరోపించారు. నిజాం కాలంలో సింగరేణికి కేటాయించిన 17 బొగ్గు గనుల్లో ప్రస్తుతం ఒక గనిని మాత్రమే అప్పగించారని, మిగిలిన 16 గనులను కూడా సింగరేణికే ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. తాడిచర్ల-2 గనిని కూడా సింగరేణి సంస్థే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సింగరేణిలో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, ఆధారిత ఉద్యోగాల భర్తీని వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రైతులు, కార్మికులు, తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికే తమ పార్టీ పనిచేస్తోందని కవిత పేర్కొన్నారు. ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరించి రాజకీయాలకే పరిమితమవుతున్నాయని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రైతులపై నమోదైన కేసులు, రౌడీషీట్లను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై తాము పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని కవిత స్పష్టం చేశారు. అవినీతి, భూకేటాయింపులు, రైతులు, కార్మికులు, ఉద్యమకారుల సమస్యలపై తమ పార్టీ నిరంతరం ప్రజల మధ్యే ఉంటుందని తెలిపారు. రాజకీయ విమర్శలకు తాము ప్రజా సమస్యలతోనే సమాధానం చెబుతామని, తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాటం కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు.

# సింగరేణి హక్కులకై పోరాటం

- పీవీకే–5 గనిలో కార్మికులతో కవిత భేటీ
- 16 బొగ్గు గనులు ఇచ్చే వరకు పోరాటమని హెచ్చరిక
- మెడికల్ బోర్డుపై స్పష్టత లేకపోతే దీక్ష ప్రకటింపు



**కొత్తగూడెం, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రక్షణ సేన రెండో విడత 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం కొత్తగూడెంలోని పీవీకే-5 బొగ్గు గనిని సందర్శించారు. గనిలోకి దిగి కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, పని పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సింగరేణి కార్మికుల సమస్యలు, బొగ్గు గనుల కేటాయింపులు, కార్మిక హక్కులపై పలు వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ నిజాం కాలంలో సింగరేణికి కేటాయించిన 17 బొగ్గు గనుల్లో ప్రస్తుతం ఒక్క గనినే తిరిగి ఇచ్చారని, మిగిలిన 16 గనులను కూడా సింగరేణికి అప్పగించే వరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. కార్మికుల భద్రత, సంక్షేమంపై కూడా కవిత ఆందోళన వ్యక్తం చేశారు. గనుల్లో కార్మికులకు నాసిరకం భద్రతా పరికరాలు అందిస్తున్నారని, తాగునీరు, సరైన గాలి వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఆరోపించారు. కార్మికుల పట్ల అధికారులు మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించడం వల్ల కార్మికుల హక్కులు దెబ్బతింటున్నాయని కవిత విమర్శించారు. సింగరేణి కార్మికులు తమ హక్కుల కోసం భయపడకుండా పోరాడాలని, ధర్మం తమ వైపు ఉన్నప్పుడు వెనకడుగు వేయవద్దని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే సింగరేణిని మరింత బలోపేతం చేస్తామని కవిత పేర్కొన్నారు.

# మూసీ పనులపై సీఎస్ సమీక్ష

- తొలి దశ పనులను పరిశీలించిన సంజయ్ జాజు
- వరద నివారణ, మురుగునీటి శుద్ధిపై దృష్టి
- ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచన



**హైదరాబాద్, జులై 9 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం మూసీ నదీ తీర అభివృద్ధి ప్రాజెక్టు తొలి దశ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉస్మాన్‌సాగర్, నర్సింగి మురుగునీటి శుద్ధి కేంద్రం, గాంధీ సరోవర్ ప్రాజెక్టు ప్రాంతాలను సందర్శించి అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర నదీ పునరుజ్జీవన, పట్టణాభివృద్ధి కార్యక్రమంలో ఈ ప్రాంతాలు కీలకమని అధికారులు వివరించారు. పర్యటన సందర్భంగా మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, సంయుక్త మేనేజింగ్ డైరెక్టర్, హైదరాబాద్ మహానగర తాగునీరు-మురుగునీటి సరఫరా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సంజయ్ జాజు సమీక్ష సమావేశం నిర్వహించారు.

వరదల నివారణ చర్యలు, మురుగునీటి శుద్ధి వ్యవస్థ అనుసంధానం, భూసేకరణ అనంతర అభివృద్ధి పనులు, నదీ తీర ప్రాంత మౌలిక సదుపాయాల ప్రణాళిక వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయ ప్రణాళికతో పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. మూసీ, ఈసా నదుల మధ్య గాంధీ సరోవర్ సంగమం వరకు ఉన్న ప్రాంతానికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సంజయ్ జాజు సూచించారు.

ఈ మాస్టర్ ప్లాన్‌ను మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ సంయుక్తంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. మూసీ నదీ తీర అభివృద్ధి ప్రాజెక్టును హైదరాబాద్‌కు ఆదర్శవంతమైన పట్టణాభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగనున్నాయని అధికారులు పేర్కొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in